# బొబ్బట్టు ముక్క

రాయప్రోలు హైమ



ఎంత ఆలోచించినా తనకి మొదటి స్థానం ఎందుకు రాలేదో బోధపడలేదు భారతికి. తను చక్కగా మాట్లాడింది. మొదట టాపిక్ ఉద్దేశం వివరించింది. "అనాదిగా దగా పడిన ఆడవాళ్ళకి ఆస్తి హక్కు కల్పించి ఇప్పటికైనా వారికి ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయం చేకూర్చాల్సిన 'విధి' ప్రజలది-ప్రభుత్వానిది... మీదు మిక్కిలి పురుష ప్రపంచానిది" అని నొక్కి వక్కాణించింది. వార్నింగ్ బెల్ మోగగానే వాక్యం ముగించేసి వేదిక దిగి పోయింది. అసలు సిసలు డిబేటర్ పాటించాల్సిన నియమ నిబంధనలన్నీ పాటించి చక్కని పాయింట్స్ మాట్లాడి సభని రంజింప చేసిన తను ప్రథమ, ద్వితీయ స్థానాలలో లేకుండా థర్డ్ ప్లేసులో ఉండటమా!...

"అన్యాయం, మేడం. మాట్లాడుతూ మాటలు దొరక్క అవస్థపడిన శైలజకి 'ఫస్టి'చ్చేరు. "బిగినింగ్-మిడిల్-ఎండ్" ఏదీ లేకుండా ఏదేదో మాట్లాడేసిన 'రీటా'కేమో సెకండిచ్చేరు."

వాపోయింది జడ్జిగా వ్యవహరించిన సోషియాలజీ మేడం 'సౌమ్య' ముందు.

"నాదేం లేదమ్మా! నేను నీకే ఫస్టిచ్చేను-అంటే పాతిక్కి ఇరవై నాలుగే సేనా! మరి ఆ రెండో జడ్జి 'ఝాన్సీ' గార్నడుగు. ఆవిడ నీకు వట్టి నాలుగంటే నాలుగే మార్కులు వే సేరు." సౌమ్యంగానే రెచ్చగొట్టింది సౌమ్యా మేడం భారతిని ఝాన్సీ మీదికి...

"ఏమిటీ అన్యాయం, మేడం?, మాట్లాడుతూ మాట్లాడుతూ మాటలు దొరక్క తడుంకున్న శైలజకేమో ఫస్టిచ్చేరు." అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా మళ్ళీ ఆ మాటలే మొదలు పెట్టింది భారతి... తెలుగు సుందరిగారు బయటకు రాగానే తను ఏమాత్రం ఆలస్యం లేకుండా 'డయాసు' ఎక్కుదామని... చాక్‌పీసులు, డస్టరు, మాప్ చుట్ట పట్టుకుని కారిడార్‌లో నిలబడిన 'ఝాన్సీ' మేడంని నిలదీస్తూ.

ఝాన్సీ ముందు భారతి కేసి రుస రుస చూసింది. తర్వాత సమాధానం 'బాంబ్'లా వదిలింది.

"ఎందుకో తెల్సా...నూరు తిట్లు తిన్నా ఒక 'బొబ్బట్టు ముక్క' ముందు పనికిరావు కదా... అందుకు..."

"అన్యాయం, సుందరీ! బెల్లుకొట్టి అయిదు నిముషాలయింది. ఇలా నువ్వు ప్రతిరోజూ అయిదేసి నిముషాల చొప్పున ఎంక్రోచ్ అయిపోతే ...మన నూట ఎనభై వర్కింగ్ డేసు కలిపితే మొత్తం నా టయిమ్ ఎంత తినేస్తున్నావో తెల్సా?"

ఇటు భారతికీ, అటు సుందరికీ విషయం పూర్తిగా అవగతం కాకుండానే విసవిసా క్లాసులోకి నడిచింది ఝాన్సీ.

* * *

మాతృశ్రీ మహిళా కళాశాలలో ఏటా ఎలక్షన్స్ జరుగుతాయి. యూనియన్ లీడర్స్‌ని ఎన్నుకుంటారు. యూనియన్ ఇనాగురల్ ఫంక్షన్ అయిపోయేక... చాలా చాలా సాంస్కృతిక కార్యక్రమాలు సంవత్సరం పొడుగునా జరుగుతూనే ఉంటాయి. అందులో ఒక భాగమే 'సిరీసు ఆఫ్ డిబేటింగ్ కాంపిటీషన్స్'. నెలకొక పర్యాయం హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తారు. మొదటి నెలలో పాల్గొన్నవారు మళ్ళీ నెలలో డ్రాప్ అయిపోతే అయిపోవచ్చు కాని... మొదటిసారి పాల్గొనని విద్యార్థిని మాత్రం ఇంక పాల్గొనడానికి వీలులేదు. డిబేట్ అయిపోగానే ఎవరికి ఎన్నో స్థానం వచ్చిందీ ఎనౌన్స్ చేస్తారు. సంవత్సరం చివర యూనియన్ వాలిడిక్టరీ ఫంక్షన్ ముందు మొత్తం అన్ని నెలల మార్కులూ టోటల్ చేసి ఫస్టు- సెకండ్-థర్డ్-లకి దువ్వూరి సుబ్బమ్మా గోల్డ్‌మెడల్- సిల్వర్ కప్...బ్రాన్జ్ షీల్డులు ఫంక్షన్‌లో అందిస్తారు. భారతి మంచి వక్త.

* * *

"ఏమిటే...ఝాన్సీ మేడం... ఆ బొబ్బట్టు ముక్క జవాబూ"... విసుగు చూపించింది విమల.

"ఆవిడ...సన్నగా...ఈనెపుల్లలా ఉంటారుగ!... స్వీట్లు తింటే కొంచెం లావెక్కి అందంగా కన్పించవచ్చునీ...తాపత్రయం." అక్కసు వెళ్ళగక్కింది అనూరాధ.

"అదేం కాదు. సెన్సు స్టూడెంట్సు. ఆవిడ సంగతి మీకేం తెలుసు? నన్ను అడగండి. నే చెప్తా." గుట్టు మిటకరించింది లావణ్య.

అందరూ ఉత్సుకత ప్రదర్శిస్తూ 'లావా' కేసి చూసేరు. "ఆవిడ ఈ మధ్య చరిత్ర ప్రసిద్ధి గాంచిన తెలుగు పిండి వంటలు"... అనే పుస్తకం వ్రాస్తున్నారు. అందుకే క్లాసులో కూడా 'బొబ్బట్లు-పోణీలు-పెసర పూరణం బూరెలు...ఏయే రాజుల హయాంలో ఎలాంటి మార్పులు చెందుతూ ఈనాటి ఈ రూపాన్ని సంతరించుకున్నాయో...అవే ఉదాహరణలు...చచ్చి పోతున్నాం, బాబూ."

గొప్పగా మాట్లాడేననుకుంటూ ఫ్రెండ్స్ కేసి గర్వంగా చూసింది 'లావా'...కాని, అంతా చప్పగా చల్లారినట్లు కన్పించేరు.

కొంచెం సేపు నిశ్శబ్దం. నెమ్మదిగా భారతి గొణిగింది. "ఏమయినా సరే! రేపు హిస్టరీ డిపార్ట్‌మెంటు కెళ్ళి ఝాన్సీ మేడంని అడిగేస్తాను. 'వేర్ లైసు ది ఫాల్ట్?' చెప్పండి, మేడం. సరిదిద్దుకుంటాను...అని."

ఆ పాటికి అంతా గుండెల మీద పుస్తకాలు, తలగడాల మీద కాళ్ళు పెట్టి అడ్డదిడ్డంగా పడి నిద్రపోయేరు. లేడీసు హాస్టల్ నిద్రా ముద్ర దాల్చబోతుండగా 'మేట్రన్ ఆంటీ' రూమ్ రూమ్‌కీ వెళ్ళి లైట్స్ ఆఫ్ చేసింది.

* * *

"నూరు మాటల కంటే ఒక బొబ్బట్టు ముక్క నయం అన్నానంటే...వట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేల్ తల పెట్టుమోయ్ అని అర్థం. ఆడవాళ్ళు...ఆస్తి హక్కు అంటూ డిబేట్లలో పాయింట్లు





మాట్లాడటం కాదు. నీ సాటి ఆడదానికి... నీ ఇంట్లో పని చేసే మనిషికి నువ్వుగా చెయ్యదల్చుకున్న ఉపకారం...ఏదైనా ఉందా!..."

"మా తాతగారూ...మాపెద నాన్నగారూ, మేడం...అసెంబ్లీ లోనూ, పార్లమెంటులోనూ, మేడం...మరేమో...స్త్రీల ఆస్తి హక్కు కోసం బిల్లులు పెడుతున్నారండీ...అంటావ్! అవన్నీ ఎందుకో తెల్సా! మీ పది కోట్ల ఆస్తి ప్రభుత్వ పరం కాకుండా... నీకూ, మీ అక్కలకీ, మీ మేనత్తలకీ పంచేస్తే మీ వదిన లెలాగూ తెచ్చుకుంటారుగా...సొమ్ము సొమ్ముగానే ఉండిపోతుందనీ...స్వార్థం వట్టి స్వార్థం."

"నర్లే-బెల్లు కింక అయిదే నిముషాలుంది. నేను కారిడార్‌లో నిలబడకపోతే సుందరి నా క్లాసు మింగేస్తుంది."

నిశ్చేష్టురాలై నిలబడిన భారతి చాలా సేపటికి తేరుకుంది. "అదన్నమాట" అనుకుంది. కాళ్ళీడ్చుకుంటూ క్లాసుకీ, లాంగ్‌బెల్ అయిపోయేక హాస్టల్‌కీ నడిచింది.

* * *

"ఏం తల్లీ! ముసుర్లో బయల్దేరి వొచ్చే సేవ్? ఫోన్ చేస్తే కారు పంపించే వోణ్ణిగా...బస్సులో

ఎందు కొచ్చావ్! ఎర్ర కాలవ పొంగుతే అ వత లుండి పొయ్యే దానివేనా?" భారతి కనుచీకటి ముసురుకుంటుంటే గుమ్మంలో అడుగు పెట్టడం చూ సి మందలింపుగా అన్నాడు పెద్ద బుగత...గొలుసుల ఉయ్యాల ఊగుతూ తాపీగా పాలికాపుతో మాట్లాడుతున్న వాడల్లా ఆగి.

"హాస్టల్‌లో 'కంజెక్టివైట సి' (ఐ ఇన్‌ఫెక్షన్) వచ్చింది. తాతయ్యా! కాలేజీ వారం రోజులు మూ సే సి అందర్నీ ఇళ్ళకి పొమ్మన్నారు."

"అయితే. ఊళ్ళోనే ఉందిగా చిన్నత్త! ఆడికే పోక పొయ్యావా! ఎప్పటికన్నా ఆడికి పోవాల్సిన దానివేగా!"

"ఏంటి. తాతయ్యా! నేనెప్పుడొచ్చినా విను క్కుంటా వేం!

"వచ్చే వారం గేదె ఈనుతుంది. జున్ను తినాలి రమ్మని మొన్నెప్పుడో ఫోన్ చే సేవుగా! మళ్ళీ ప్లేటు ఫిరాయించేవా! పోన్లే! నీకంత కష్టం అయితే ఇప్పుడే వెనక్కి పోతా లాస్టు బస్సుకి." బుంగమూ తి పెట్టి గారాలు పోయింది భారతి.

"సర్లే! సర్లే! కోప్పడమాక!... అంటే ఎల్లుండ్నించి విధానసభ వర్షాకాలం సిట్టింగు లుండయ్‌గా! నేను రేపు హైదరాబాద్ పోవాల. ఈడేమో ఊడ్పులయి సావటంలా! ఇంట్లో ఒంట్రిగా ఉంటావనీ అట్టన్నా."

భారతి భుజానున్న ఎయిర్ బాగ్ తీ సి అక్కడ పడే సి ఉయ్యాల బల్లెక్కి పెద్ద బుగత ఒళ్ళో తల పెట్టుకుని కాళ్ళు చాచింది రిలాక్సింగ్‌గా!

రైతుకి అదునో పదునో అన్నారు. అనలే వర్షాధారం పొలాలు. అదునొచ్చి నప్పుడు దమ్ముచే సి నారు సిద్ధం చేసుకుంటే కూలీలు దొరకాలే కాని ఊడ్పులెంత సేపు! అయితే. ఊళ్ళో అందరికీ ఒక్కసారే అదునొస్తుంది. కొందరికి 'నారు' తక్కువయితే. మరి కొందరికి డబ్బు సమయానికి దొరకదు. అన్నీ కుదిరి అదును పోతుందని రైతు కంగారు పడుతుంటే సమయం కని పెట్టి కూలీలు కొమ్మెక్కి కూర్చుంటారు-

అనుముల వాడికి అనుముల గోల-
అడుసు కళ్ళవాడికి దోమల గోల అన్నట్లు.

"ఏందంటావురా. సుబ్బన్నా." పెద్ద పాలికాపు మౌనానికి ఏమనాలో తోచలేదు బుగతకి.

"మొత్తం నూట పాతిక మందిని పెట్టుకుంటే రేపు సందాలకల్లా ఊడుపయిపోద్ది.... బుగతా...కొని..."

"డబ్బులు పెంచమంటుండారన్నావ్‌గా! ఏపాటి?"

"ఆడోళ్ళు పదకొండున్న రంటుండారు. బుగతా! మరి మగోళ్ళు పద్దాలుగైనా లేందే వస్తరాని..."

"అబ్బ! ఒక్కపాలే పెంచితే ఎవుడిస్తాడ్రా?" బుగత మండిపడ్డట్లన్నా... సుబ్బన్న చెక్కు చెదర లేదు. లేచి నిలబడి తలపాగాలా కట్టుకున్న తువ్వాలు విప్పి టపీక్కున దులిపేడు. నేలనున్న కర్ర వంగి అందుకుంటూ "మరి అదునట్టుండాది. బుగతా" అన్నాడు. "నాయుడమ్మ...కరణం గోరు...మున్సబుగోరు...అంతా రేపే ఊడుస్తుండారు. ఉప్పుడు గాపోతే ఇంకెప్పుడు. బుగతా. కూలీ జనాలకి నాలుగు పైసలు కానొచ్చేది!"

"సర్లే! ఎట్టనో జావండి!" వినుక్కుంటూ బల్ల దిగేడు పెద్ద బుగత..."రేపు సాయంత్రానికి పని పూర్తి కావాల! తను చిన్న కార్లో కూర్చోవాల..." ఆ మేరకు సుబ్బన్నకి తగిన మందలింపులు అందించేడు.

"ఏంటి. తాతయ్యా?" ఆవలిస్తూ ఒళ్ళు విరుచుకుంటూ తను కూడా ఉయ్యాల బల్ల దిగింది భారతి.

"ఏందోలే! పొలం గొడవలు. పోయి స్నానం చే సెయ్! భోజనం చే సేద్దాం." భారతి భోజనం చే సి మంచం ఎక్కింది ఆవలిస్తూ... ఆలోచనల్తో కుస్తీపడుతూ!

'ఈ పిల్లేందో. ఈ గొడ వేందో! చెప్పిన మాట అసలు...లెక్క జెయ్యట్లా...' రగ్గు మనవరాలికి కప్పి పక్కనే ఉన్న పందిరీ మంచం మీద పడుక్కుంటూ దాశరథీ శతకంలో పద్యాలు తనలో తనే గొణుక్కున్నాడు బుగత.

* * *

కోడి కూతలూ. పక్షుల కిలకిలారావాలూ. పాడి గొడ్ల అంబారావాలతో తెల్లవారింది ఆ పల్లెలో.

పెద్ద బుగత స్నానం చే సి సూర్య నమస్కారాలు చే సి ఉయ్యాల బల్లెక్కి కూర్చున్నాడు. సుబ్బన్న ఊడ్పుల ఊసు ఏం జేసుకొస్తాడోనని ఎదురు చూస్తూ!

భారతి షోల్డర్ బాగ్ వేలాడేసుకుని. చేత నాలుగు పుస్తకాలు పట్టుకుని మేడ దిగింది.

మీరు చివరకు వాడాల్సింది...
సపట్ లోషన్
లేక మలామ్
తామర, గజ్జి మర్షియు
దురదలకు




SAPAT & CO. BOMBAY-2
ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడులకు ఏజంట్లు
ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్
వెంకటేశ్వరపురం,
విజయవాడ - 520 010.

# రోగాలవిముక్తికి

**ఐదువైద్యవిధానాలు:-** ప్రతివైద్య విధానంలోను కొన్ని రోగాలనివారణకు ప్రత్యేకత ఉంది. ఈపుస్తకంలో, వచ్చింది ఏరోగమో తెలుసుకోవటానికి, ప్రతిరోగానికి రోగలక్షణాలు, వాటినివారణకు. అనుభవంగల 5 రకాలడాక్టర్లుచెప్పిన, అల్లోపతి, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందుల వివరాలు, 427 రోగాలకున్నాయి. విధానాలన్నీ తెలుసుకొంటే మీకిష్టమైంది అనుసరించవచ్చును. వెల రూ.30.

**ఆహారవైద్యము:-** మనరోగాలను నయంచేసుకోవటానికి కావలసిన మందులన్నీ మనంతినే పండ్లు, దుంపలు, కాయగూరల్లో సహజంగానేఉన్నాయి. ప్రకృతివైద్యులు, ఏరోగానికేమితినాలో తెల్పిన పూర్తివివరాలన్నీ యీపుస్తకంలో ఉన్నాయి. వెల రూ. 15-00.

**మూలికావైద్యము:-** ఇంట్లోదొరికే మిరియాలు, అల్లం, జీలకర్ర మొదలైన మూలికలతో వివిధరోగాలవిముక్తికి. అనుభవంగలవారు చెప్పిన ఖర్చులేని ఎన్నోమంచి మార్గాలు. పూర్వకాలంనుంచీ వాడుకలోఉన్నవి యిందులో ఉన్నాయి. రూ. 15.

తరుచువచ్చే రోగాలకయ్యే విపరీత ఖర్చు తగ్గించటానికి, పై3 తెలుగుపుస్తకాలు మీకు చాలా ఉపయోగం. అవుసరమొచ్చినపుడు ఆదుకొంటాయి. ప్రతియింటా ఉండతగినవి. ఈ3 పుస్తకాలు రూ.60 కే పంపబడును. విడిగా పోష్టుఖర్చు రూ. 7 అదనము. రూ. 40కి ఆపై విలువఆర్డర్లకు వి.పి.పోష్టుఖర్చులు ఉచితము.

దేశసేవప్రచురణాలు, ప్లాటు నెం.2, ఇందిరానగరు, వెంగళరావునగరు ఓవరుహెడ్ వాటరుటాంకుసమీపాన, హైదరాబాదు - 500890 కు ఉత్తరంవ్రాస్తే మీకుకావలసిన పుస్తకాలు వి.పి. పోష్టుద్వారా పంపబడును. మీకెంతో ఉపయోగించేవీటికొరకు అశ్రద్ధచేయకుండా వెంటనేవ్రాయండి.

"తాతయ్యా! నాయుడు పెద్దయ్యగారి సుశీలక్క ఊళ్ళోనే ఉందట. సెన్సు చెప్పించుకుని సాయంత్రానికల్లా వస్తాను. నే వచ్చేదాకా నువ్వు బయల్దేరకేం!" భారతి గుమ్మం దాటింది.

"ఆరింటికల్లా వచ్చెయ్. భారతీ! నిన్ను చిన్నత్తింటో దింపి నేను రాజధానికి పోతా! ఎనిమిదింటి కల్లా మనం చిన్నకార్లో కూచోవాల..."

అరిచేడు బుగత!

భారతి వెళ్ళిపోయేక చాలా సే పలాగే కూర్చున్నాడు. ఏడు దాటి పోయింది. ఎక్కడా సుబ్బన్న జాడా-జవాబూ లేదు. 'ఈ కూలీ జనాలది మరీ పాటకపు బుద్ధి. అదును చూ సి మొండికేస్తారు. ఆడాళ్ళు మరీను. ఎంత ముంచుకొస్తున్నా సరే. వంటలు వండి...తిని...కారేజీల్లో పెట్టి...చింపిరిజుట్లు దువ్వి కొప్పులు బిగించి...మందార పూలో...తంగేడు పూలో తురిమి...చీరెలు పైకెగ్గట్టి "రావణా తందనాలో" అని పాడుకుంటూ కాని చేలల్లో దిగరు. మగోళ్ళే నయం. రమ్మంటే అరగంట ముందుగానూ వస్తారు. ఉండమంటే మరో పావుగంట పని పూర్తయ్యే దాకా ఉండనూ ఉంటారు."

ఏదో ఆలోచిస్తున్నాడు కాని బుగతకి చిరాగ్గా ఉంది. 'సుబ్బన్నింకా రాలేదే మబ్బా! నూటపాతికమందీ దొరకలేదా! వాళ్ళడిగిన రేటే ఇచ్చేస్తామన్నాంగా! ఆ నాయుడమ్మ రేటెక్కువ పెట్టి సి మొత్తం జనాన్ని తోలుకు పోలేదుకదా! నూటపాతిక్కీ ఒక్కళ్ళు తక్కువయినా తనకి పని జరగదు.'

ఆలోచిస్తూనే వంటవాడు తెచ్చిన డజ నిడ్లీ...రెండు ప్లేట్ల పచ్చడి నిమ్మకాయంత పేరిన నేతిముద్దతో కానిచ్చే సి, పెద్దగ్లాసుడు వేడిపాలు తాగి బ్రేవుమని తేనుస్తూంటే సుబ్బన్న గుమ్మంలో అడుగు పెట్టేడు.

"బుగతా, కొంపలంటు కుండయ్యా."

"ఏందిరా! కూలీ ల్దొరక లేదా!"

"దొరికేరు. బుగతా!" న సిగేడు సుబ్బన్న.

"మరింకేందీ! రేటెక్కు వడుగుతుంటే మరో పావలా పెట్టెయ్! సందే యించమాక."

బుగతకి కంగా రెక్కు వయింది. రేపట్నుంచి వర్షాకాలం సమావేశాలు. అ సెంబ్లీలో కూర్చోవాలి. ఆడపడుచుల ఆ స్తి హక్కుల సంగతి కదిపించాలి.

"రేటు గొడవకాదు. బుగతా! ఈ ఆడోళ్ళతో మా చెడ్డ చావొచ్చింది. పోనీ...ఆడోళ్ళని మాన్పించేద్దామా అంటే ఉన్నోళ్ళే...ఆళ్ళు...మనూళ్ళో 'ఆడపుటక' మరీ ఎక్కువగా ఉంది. బుగతా!" వేదాంతం మొదలెట్టేడు విషయం టగ్గర కెలా రావాలో తెలియక సుబ్బన్న.

"చెప్పే దేందో సరింగా చెప్పేడు? అసలేందీ గొడవా?" బుగత గావుకేక పెట్టేడు.

సుబ్బన్న వివరించేడు. రాత్రి తాము అడిగిన రేటుకి బుగత ఒప్పుకున్నాడనగానే గూడెం అంతా ఆనంద పడిపోయేరు. ఆడకూలీలు మరీ ఇదయిపోయి మర్నాడు కారేజీలు పట్టుకెళ్ళడానికి పచ్చళ్ళు నూరుకుని. బియ్యం ఏరుకుని. ఎండుకట్టెలు పొయ్యివార పెట్టుకుని సిద్ధపడిపోతుంటే సుబ్బన్న మరో నలుగురు జట్టు కూలీలను వెంటపెట్టుకుని నాయుడమ్మనీ. కరణాన్నీ. మున్సబునీ కలుసుకున్నాడు (వాళ్ళ కరణంగిరీ, మున్సబుగిరీ ఊడిపోయినా వాళ్ళనింకా ఆ పేర్లతోనే పిలవడం బాగాలేదని పెద్ద బుగత అనుకుంటా డనుకోండి). అయితే, వారుకూడా పెద్ద బుగత ఇచ్చిన రేటే ఇస్తా మనడంతో ఆనందంతో వెనక్కి వచ్చే సేరు. తెల్లారేక ఏయే జట్లు ఎవరెవరి పొలాలకి వెళ్ళాల్సిందీ నిర్ణయించుకున్నాక ఆ ముసుం సిన రాత్రి ముసుగులు తన్ని గుడి సె ల్లో నిద్రపోయారు.

ఆడవాళ్ళు తెల్లారకట్టే లేచి బట్టత సి చినుకుల్లోనే పాచిపనులు చేసుకుని. పొయ్యిల ం రాజేసుకుని. వంటలు మొదలెట్టేరు మామూ లుగానే. అంతలో ఏ మొచ్చిందో మరి! గుంపులు గుంపులుగా...రావిచెట్టు కింద, బావి గట్టున...కొండవార...నిలబడి గుసగుసలు మొదలు పెట్టేరు. ఓ మూ ల పొద్దెక్కి పోతోంది. ఎవరూ చద్దిబువ్వ ఏర్పాట్లు చెయ్యడంలేదు.

'ఏమైందీ! గూడెంలో కుర్ర దేవరయిం గా వుష్పవతి కాలేదు గదా! ఈ సందట్లో సందడి. మళ్ళీ కట్టవలంట బడి తాటాకులు నరుక్కొచ్చి. ..పిల్లని పసుపులో ముంచెత్తి ఆ సంబరం పూర్తయి తే కాని చేలో కాలు పెట్ట రీ ఆడ అవ్వలంతా!'

సాలోచనగా సుబ్బన్న రావిచెట్టు వేపు నడిచేడు. అతనికి ఎదురొచ్చింది నాగమ్మ!

"సుబ్బన్నా! మా ఆడోల్లందరికీ అన్యాయం జరిగిపోతోంది. మీతోపాటు మేం కూడా పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుంటుండాం! మాకు పదకొండున్నరేంది! మీకు పద్దాలు గేంది? మాకూ పద్దాలు గి స్తేనే మేం ఊడ్సేది! లేకపోతే [illegible]!"

నిక్కచ్చిగా చెప్పే సింది. సుబ్బన్నకి తల తిరిగిపోయింది. ఇది నాగమ్మ అభిప్రాయం మాత్రం అయితే ఫర్వాలేదు. ఆమెతో పాటు మరో పదిమంది ఉన్నా కొంపలంటుకోవు. కాని...గూడెం ...అంతా అలాగే అంటున్నారు

విన్న పెద్ద బుగతకి కోపం ముంచుకొచ్చింది. బాధ పెల్లుబికింది. మెదడు పని చెయ్యలేదు.

"మరెట్టాగరా! ఓ పన్నెయ్యి! ఆడోల్లని అసలు మానే సి అంతా మగోల్లనే రమ్మను ... బుర్ర తిరిగి దారి కొస్తారు అప్పలు." గట్టిగా ఊపిరి తీసుకుంటూ కోపం ఆపుకోలేక 'ఉయ్యాల బల్ల'...జోరుగా కదిపేడు.

"అదయినా అంతే అవుద్ది. బుగతా! పైగా మనూళ్ళో అంతమంది మగ కూలీ లెక్కడుండా రు? మనూరికి పోలేరమ్మ వారం ఉందిగా! ఆడపుటక ఎక్కువ. మీ మటుకు మీకు ఆరుగురు అమ్మాయిలూ...ఇద్దరబ్బాయిలూనా...మీ పెద్దబ్బాయిగార్కి..."

"చాల్లే అవు!" సుబ్బన్న మాట మధ్యలో తుంచేస్తూ గర్జించేడు బుగత.

"ఏందీ! మనూళ్ళో మనమీద...ఆడాళ్ళు తిరగబడ్డమా..మనం లొంగిపోడమా! బెయిటవాళ్ళనించి పిలిపిద్దాం కూలీలని..." బుసలు కొట్టేడు.

"అంత టయిం లేదుకదా. బుగతా! నల్లోనిగూడెం రెండు కోసులుందా! ఎర్రకొండపల్లి ఏడు ఫర్లాంగులు. అదునేమో ముంచుకొచ్చె! ఆడకూడా అదునే గందా! మనం ఎల్లినా ఆల్లు రావద్దూ?..." నిమ్మకి నీరో సినట్లు నిబ్బరంగా నిలబడ్డాడు సుబ్బన్న.

"మరి కరణం...మున్సబు...నాయుడవమ్మా...ఆళ్ళేం జేస్తుండారంటావ్!" తను ఎమ్మెల్యే ఠీవిలో ఉయ్యాల బల్లమీద ఊగుతుండగా మిగతా రైతులు మగకూలీలని పెట్టి పని కానిచ్చేసుకుంటున్నారేమో!

"అల్లా తవుర్నాగే బుర్ర గోక్కుంటుండారు." చల్లగా చెప్పేడు సుబ్బన్న.

స్తిమితంగా రెండు నిముషాలు ఆలోచించేడు బుగత. ఇంతకాలంగా ఈ ఊళ్ళో తన్నెదిరించిన వాడు లేదు. అప్పుడప్పుడు కూలీ పెంచమని జనం అడగడం-నలుగురు పెద్దరైతులూ ఆ విషయం తనకే వదిలెయ్యడం...తనేమో మధ్యే మా

## స్వాగతం



**మందస్మితం** కాదది మధు స్మితం
మధుర దరహాస చంద్రికా ధవళయుతం
నులి వెచ్చని కౌగిలిలో మల్లెల హాసం
తెల్లని బుగ్గలపై విరి సిన దరహాసం
నునుచెక్కుల నిగారింపు గుబాళించి
ప్రణయోదంతంగా పులకించిన నినదం
సుందర నందనోద్యానంలో వెల సిన పారిజాతం
సుందరి నయనాంచలాల హ సించిన దర
హ సితం
శరచ్చంద్ర చంద్రికా ధవళహాసం
చరత్ యామినీ పూర్ణ చంద్రహాసం

-డా. ఆర్. అనంత పద్మనాభరావు

